రొంపిచర్లలో అత్యధిక వర్షపాతం

- 121.8 మి.మీ నమోదు
- 14 రోజులపాటు వర్షాలే!
- మండలంలో 80 శాతం పంట భూములు
- మిర్చికి నష్టమంటూ రైతుల ఆవేదన

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల ప్రారంభం మొదలు ఏదో ఒక గ్రామంలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. అక్టోబర్ నెలలో 21 రోజులు జరగ్గా మండల కేంద్రమైన రొంపిచర్లలో 14 రోజులు వర్షాలు కురిశాయి. ఈ నెలలో గడిచిన 21 రోజుల్లో మండల పరిధిలో వర్షం కురియని రోజు లేదు. వాగులు, వంకలు నీటి ప్రవాహంతో కలకలలాడుతున్నాయి. మండలంలోని విప్పర్ల, వి.రెడ్డిపాలెం, చాకలికుంట, నల్లగార్లపాడు, సంతగుడిపాడు తదితర చెరువులతో పాటు మండల పరిధిలోని అన్ని కుంటల్లో నీరు నిండుగా ఉన్నాయి. పొలాలకు నీరు అందించే వాగు కాల్వలు సహితం సమృద్ధిగా నీళ్లు పారుతున్నాయి. మండలంలో 80 శాతం పంట భూములు మాగాణి భూములే. ఈ భూముల్లో వరి సాగుచేయటంలో వర్షాలు సమృద్ధిగా ఉండటం వల్ల సాగునీరు ఎద్దడి ఏర్పడ లేదు. వర్షాల వల్ల మెట్ట పైర్లు సాగు చేస్తున్న పొలాలకు కొంత మేర అతివృష్టి కూడా ఏర్పడింది. పంట పొలాల్లో నీరు నిలబడింది. చిన్న వయస్సులో ఉన్న మొక్కలు అవ్వడం వల్ల ఉరక దెబ్బకు గురయ్యాయి. అయితే 20వ తేదీన మండలంలోని దక్షిణం వైపు ఉన్న గ్రామాల్లో అతి భారీ వర్షం కురియడంతో ఆ గ్రామాల్లోని రోడ్లు, పల్లపు గృహాలు, పశువుల చావళ్లలో నీరు చేరి కొంత మేర ఇబ్బంది ఏర్పడింది. వీరవట్నం గ్రామంలో వర్షపు నీరు రెండు గంటల పాటు రోడ్లపై రెండు అడుగుల లోతు పారాయి. చొప్ప దొడ్లలో, పశువుల పాకలు, కొష్టాల్లో నిల్వ ఉంచుకున్న పశు గ్రాసం కూడా వర్షపు నీటికి కొంత మేర ఆటంకం ఏర్పడింది.



వీరవట్నంలో ఆదివారం కురిసిన వర్షానికి జలమయమైన వీధి

అధిక వర్షాల వల్ల గ్రామాల్లోని సైడ్ డ్రైన్‌లో కూడా చెత్తా, చెదారం అడ్డుపడి మురుగు ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. సైడ్ డ్రైన్‌లు పూడిక పోవడం వల్లనే వీరవట్నం గ్రామంలో వర్షపు నీరు రోడ్లపై పారింది. ఈ నెలలో మండల కేంద్రమైన రొంపిచర్లలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. 1, 2 తేదీల్లో వర్షపాతం నమోదు కాలేదు. 3వ తేదీన 1.2 ఎం.ఎం. 4వ తేదీన 2.4 ఎం.ఎం., 9వ తేదీన 4.2, పదివ తేదీన 1.0ఎం.ఎం. 11వ తేదీన 37.8 ఎం.ఎం. 12వ తేదీన 2.0 ఎం.ఎం. 14వ తేదీన 2.4, 15వ తేదీన 19.0, 16వ తేదీన 0.2, 17వ తేదీన 17.6, 18వ తేదీన 9.0, 19వ తేదీన 5.0, 20వ తేదీన 5.0, 21వ తేదీ ఉదయానికి 15.0 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. ఈ నెలలో సరాసరి వర్షపాతం 21 రోజుల్లో 73.4 ఎం.ఎం. వర్షపాతం నమోదు కావల్సి ఉండగా 121.8 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. 11వ తేదీన అత్యధికంగా 37.8 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా 15వ తేదీన 19.0 ఎం.ఎం. 17వ తేదీన 17.6 ఎం.ఎం. 21న 15.0 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. ఎప్పుడూ లేనంతగా ఈ నెలలో ఎక్కువ వర్షపాతం నమోదు అవ్వడం వల్ల గ్రామాల్లో చిత్తడి వాతావరణం నెలకొంది.



మిర్చి పొలంలో నిలిచిన వర్షపు నీరు

ఈ పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు, ఆరోగ్య శాఖలు అప్రమత్తమై పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి ఉంది. దోమల నివారణకు కూడా పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా చేపట్టాలి. దోమలు ప్రబలకుండా, అంటు వ్యాధులు రాకుండా మండల ప్రజలు కూడా తగిన పారిశుద్ధ్య, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని వైద్యులు తెలుపుతున్నారు.

మిర్చికి నష్టమే



ఈ నెలలో కురిసిన వర్షాలు వరిపైరుకు అనుకూలంగా ఉన్నా, మెట్టపైర్లలోని మిరప మొక్కలు ఉరకదెబ్బకు గురయ్యాయి. కంది పొలంలో కూడా నీరు నిలబడటంతో ఉరక దెబ్బ తగిలి ఎర్రగా మారాయి. పూర్తిగా వర్షాలు నిలిచి నాలుగు రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటే గాని మిర్చి మొక్కలకు వాటిల్లిన నష్టం తెలుస్తుంది. –గోవిందరెడ్డి, మాచవరం

రాయితీపై వ్యవసాయ పరికరాలు

శావల్యాపురం: ఉద్యాన శాఖ వారి సారధ్యంలో రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు అందజేస్తున్నట్లు ఉద్యాన శాఖాధికారి షేక్ నబీ రసూల్ మంగళవారం తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని అనంతరం మాట్లాడుతూ రైతులకు రాయితీపై తైవాన్ స్ప్రైయర్లు, మినీ ట్రాక్టర్లు ప్రభుత్వ పరంగా రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. రైతుసేవా కేంద్రంలో అర్హత కల్గియున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు రైతుసేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

రొంపిచర్ల: మండలంలో విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ శాఖ అధికారి శివలలిత, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా గ్రామాలలో రైతులు సాగుచేస్తున్న వరి పొలాలను సందర్శించి పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. రైతులకు 5 కేజీల నూకలలో 200 గ్రాముల నూనె, 200గ్రాముల బ్రమోడియోలిన్ కలిపి బైట్ గా తయారు చేసి ఎలుక నివారణ మందుగా పంపిణీ చేశారు. వాటిని చిన్నచిన్న పాకెట్స్‌లో వేసి పొలాలలో ఎలుకల కన్నాల దగ్గర పెట్టి వాటిని మూసివేస్తే ఎలుకలను నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పశువైద్యాధికారి డాక్టర్ వంశీ ప్రసాద్ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం సాగు చేసే పశుపోషకదారులకు కిసాన్ కార్డులు ఉన్నాయని అన్నారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



నాదెండ్ల: గణపవరం తులసీవనం వృద్ధాశ్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు పెద్ద కుమారుడు ప్రభు చైతన్య జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం అన్నదానం నిర్వహించారు. ముందుగా ప్రభుచైతన్య జన్మదిన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అన్నపరెడ్డి లక్ష్మణ్, కళ్యాణ్ దుర్గారావు, బాలకృష్ణ, నాగేశ్వరరావు, సుభాని, రాములు, వెంకటేశ్వరరావు, సాల్మన్ ఉన్నారు.

పోరాటయోధుడు కొమరం భీమ్



చిలకలూరిపేట: గిరిజన హక్కుల కోసం జీవితం అంకితం చేసిన పోరాట యోధుడు కొమరం భీమ్ అని పలువురు ప్రజా సంఘాల నాయకులు చెప్పారు. కొమరం భీమ్ జయంతిని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.శ్రీనునాయక్, ఎం సాంబయ్య, బి.చిన్నానాయక్, కొండ్రముట్ల నాగేశ్వరరావు, డి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చిలకలూరిపేట: ఇచ్చిన హామీలన్నీ అమలు పరచటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండలంలోని కట్టుబడి వారిపాలెం, గంగన్నపాలెం గ్రామాల్లో రూ. 21 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన పాలక వర్గం



వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావు పేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన పాలక వర్గాన్ని సంఘ సభ్యులు, పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ పాలక వర్గంలో చర్చి అధ్యక్షులుగా విశ్రాంత ఉపాధ్యాయులు చాట్ల రామయ్య, ఉపాధ్యక్షులుగా దారివేముల మోజస్ నాగస్వామి, కార్యదర్శిగా గద్దల ఆశీవరప్రసాద్ వందనం, ఉపకార్యదర్శిగా కూచిపూడి వినోద్, కోశాధికారిగా పులిమల సునీల్ కుమార్‌లు ఎన్నికవ్వగా వీరితో పాటుగా పాలకవర్గ సభ్యులు బెజవాడ ఫ్రాన్సిస్, కె.పృథ్వీరాజు, పచ్చిగొర్ల ప్రభాకర్, నందిగం ఏసుదాసు, మంద మోషే, బీర్నేడి సంతోష్, జార్జి విన్సెంట్, కంభంపాటి నాగేశ్వరరావు, కట్టెంపూడి లింకన్, ప్రదీప్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు చాట్ల రామయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో అభివృద్ధి కమిటీ సభ్యులందరినీ చర్చి పెద్దలు, సంఘ సభ్యులు అందరినీ కలుపుకొని చర్చి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

చెరువు గుంతలోపడి పశువుల యజమాని మృతి



బొల్లాపల్లి: గేదెను ఒడ్డుకు తోలడానికి చెరువులోకి దిగిన పశువుల యజమానికి ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని కనుమలచెరువు గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు... గ్రామానికి చెందిన పూజల అంజయ్య (36) చెరువులోకి దిగడంతో గేదె ఒడ్డుకు తోలేందుకు చెరువులోకి దిగాడు. ఈ నేపథ్యంలో చెరువులో ఏర్పడిన గుంతల్లో పడటంతో అక్కడికక్కడే ప్రాణాలు పోగొట్టుకున్నాడు. సమీపంలోని గ్రామస్తులు గమనించి ఒడ్డుకు చేర్చారు. మృతుడి భార్య తిరుపతమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

వేల్పూరులో రెవెన్యూ గ్రామసభ

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు గ్రామసభ మంగళవారం నిర్వహించారు. తహసీల్దారు నాగరాజు పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రీసర్వేలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు పెరిసోమల నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

కే-రిడ్జి స్కూల్‌కు సీబీఎస్ఈ గుర్తింపు

నరసరావుపేట ఈస్ట్: గుంటూరురోడ్డులోని కే-రిడ్జి స్కూల్‌కు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) అధికారిక అనుబంధ గుర్తింపు లభించినట్టు స్కూల్ ప్రిన్సిపల్ జి.బర్నబాస్ మంగళవారం తెలిపారు. న్యూఢిల్లీలోని సీబీఎస్ఈ బోర్డు నుంచి వచ్చిన అధికారుల బృందం తమ పాఠశాలలోని విద్యా ప్రమాణాలు, మౌళిక వసతులు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం గుర్తింపు అనుమతి మంజూరైనట్టు వివరించారు. పాఠశాలలో ఆధునిక విద్యా విధానాలు, సమగ్ర విద్యా శిక్షణ, వసతులను బోర్డు అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. సీబీఎస్ఈ గుర్తింపు లభించటం ద్వారా తమ విద్యార్థులకు దేశ వ్యాప్తంగా ఉన్న సమాన విద్య శిక్షణా విధానాలు అందుతాయన్నారు. అలాగే దేశ వ్యాప్తంగా నిర్వహించే విద్యా కార్యక్రమాలలో తమ విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. సీబీఎస్ఈ గుర్తింపు లభించటం తమ పాఠశాల ఎదుగుదలకు కీలక ముందడుగు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ, అకడమిక్ కోఆర్డినేటర్ హేమంత్ పాల్గొన్నారు.



సీబీఎస్ఈ బోర్డు అనుమతి పత్రాన్ని చూపుతున్న యాజమాన్యం

సామూహికంగా ఎలుకలు నివారిద్దాం

అధిక దిగుబడులు సాధిద్దాం

నాదెండ్ల: వరిసాగులో ఎలుకల వల్ల పంట దిగుబడి 10-40 శాతం వరకూ నష్టం చేకూరుతుందని, ఎలుకల నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ చెప్పారు. సాతులూరు గ్రామంలో మంగళవారం వరిలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సామూహిక ఎలుకల నివారణ కోసం బ్రోమోడయాలిన్ మందును వినియోగించాలన్నారు. 96 పాళ్లు నూకలు, రెండు పాళ్లు నూనె, రెండు పాళ్లు విషపు మందును కలిపి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఎలుకల బొరియల వద్ద ఉంచాలన్నారు. దీంతో ఎలుకలను సమర్థవంతంగా నివారించుకోవచ్చన్నారు. అనంతరం బ్రోమోడయాలిన్ మందును సర్పంచ్ ముసుగు శోభారాణి, ఉపసర్పంచ్ శరభయ్య చేతుల మీదుగా రైతులకు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శ్రీలక్ష్మీ, ఏఈవోలు జీవన్‌నాయక్, రామారావు, వేణుగోపాల్ ఉన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ బోయపాటి రవిబాబు పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 421 రైతుసేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణ కోసం బ్లోమాడైలిన్ మందును 10 గ్రాముల ప్యాకెట్‌ను రైతులకు అందజేశామన్నారు. మండలంలోని 11 రైతుసేవా కేంద్రాలకు 32 కేజీల ఎలుకల నివారణ మందును ప్రభుత్వం అందజేసిందన్నారు. రైతులు ఆధార్ నంబరు రైతుసేవా కేంద్రం తమ పేర్లు నమోదు చేసుకుని ఎలుకల నివారణ మందు ప్యాకెట్స్ ఉచితంగా అందజేస్తామన్నారు. వరి పంటలో అగ్గితెగులు ఉందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి షేక్ నబీ రసూల్ ఏఈవో పురేటి అశోక, వీఏఏలు స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

నూజెండ్లలో....

వినుకొండ(నూజెండ్ల): రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మండల వ్యవసాయ అధికారిణి సుగుణాబేగం అన్నారు. నూజెండ్ల మండలంలోని రవ్వవరం, ముప్పరాజువారిపాలెం, ఉప్పలపాడు రైతు సేవా కేంద్రాల వద్ద సాహూమిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ ఒకేసారి ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందు వినియోగించడం వలన వాటిని నివారించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి బి.అంజిరెడ్డి, వీఏఏ కె.జాహ్నవి, సునీతకుమారి, తేజస్వి, వెంకటనాగయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎలుకల నివారణ మందును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్‌లో...

నరసరావుపేట రూరల్: వరి పంటకు తీవ్ర నష్టం కలిగించే ఎలుకల నివారణపై రైతులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని మండలంలోని పమిడిపాడులో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ, జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి, ఏపీఎంఐపి పీడీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ఎలుకల వలన వరి పంటకు 10 నుంచి 40 శాతం నష్టం కలుగుతుందని తెలిపారు.

ఎలుకల నివారణకు ఉపయోగించే బ్రోయోడయోలిన్ ఎలుకల మందును ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి మురళీ మాట్లాడుతూ ఎలుకల వలన వరిసాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సామూహికంగా వీటి నివారణకు ప్రభుత్వం కార్యచరణ రూపొందించినట్టు చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్త నగేష్, ప్రకృతి వ్యవసాయం డీపీఏ అమల కుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్ర బాబు, ఉద్యాన అధికారి నవీన్, పశువైద్యులు డాక్టర్ అర్జున్ పాల్గొన్నారు.



శావల్యాపురం పొలంలో ఎలుకల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ రవిబాబు

రైతులకు ఎరువులు పంపిణీ

రొంపిచర్ల : మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.శివలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రైతు సేవా కేంద్రాలలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఇప్పటి వరకు 250 ఎంటి డిఎపి, 279ఎంటి యూరియా సరఫరా చేశామన్నారు. మండలంలో రొంపిచర్ల జీడీసీఎంఎస్ ద్వారా, సుబ్బయ్య పాలెం పీఏసీయస్ ద్వారా 420ఎంటి యూరియా, 320ఎంటి డీఏపీ, 410ఎంటి కాంప్లెక్స్ ఎరువులు రైతులకు సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలలో 220 ఎంటి డీఏపీ, 117ఎంటి యూరియా అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో రైతులకు ఎటువంటి కొరత లేకుండా చేస్తున్నామన్నారు.

గ్రామసభకు 30 అర్జీలు



నాదెండ్ల: చిరుమామిళ్ళ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ ఎస్.ధనలక్ష్మీ, సర్వేయర్ రాంబాబు హాజరయ్యారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉన్నాయంటూ 30 మంది రైతులు అర్జీలు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమణ మాట్లాడుతూ, త్వరలో అర్జీలను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్ ఉషాంజలి, వీఆర్వో ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నాదెండ్ల: తమ ఆత్మీయుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. మంగళవారం క్లబ్ ఆధ్వర్యంలో కనపర్రు శివారు మైనంపాడులోని నైస్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు. స్వర్గీయ తియ్యగూర కోటిరెడ్డి వర్థంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ రమాదేవి, సాంబశివ రావు, స్కూల్ హెచ్ఎం సుబ్బారావు, ప్రిన్సిపల్ గణపతి పాల్గొన్నారు. అనంతరం కారుమంచి శివరావు సతీమణి సరళ వర్ధంతి సందర్భంగా చిలకలూరిపేట పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించి రెండు క్వింటాళ్ల బియ్యం, పది కేజీల కందిపప్పు అందించారు. ఇన్నర్‌వీల్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి, దండా రమాదేవి, టి.విశాలి, ఆశ్రమ నిర్వాహకులు మురికిపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

తొలగించిన ఉద్యోగులను వెంటనే తీసుకోవాలి



దీక్షలో ఉన్న ఉద్యోగులు, కార్మికులతో ఎంఐఎం నాయకులు

దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపిన నాయకులు

నరసరావుపేట: కేవలం రాజకీయ కారణాలతో తొలగించిన మున్సిపల్ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎంఐఎం నాయకులు షేక్.కరిముల్లా, మౌలాలీ, గాంధీ స్మారక సమితి అధ్యక్షులు ఈదర గోపీచంద్ కోరారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గత 19 రోజుల నుంచి సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట చేస్తున్న దీక్షా శిబిరాన్ని మంగళవారం వారు సందర్శించి తమ సంఘీభావం తెలిపారు. ఉద్యోగులపై ఏదో ఒక పార్టీ ముద్ర వేసి తొలగించటం అన్యాయమన్నారు. వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకులు చిన్న అల్లాభక్షు పాల్గొన్నారు.

వినుకొండలో కళాకారులు, గురువుల ఆత్మీయ సమ్మేళనం

వినుకొండ(నూజెండ్ల): హిమాలయ గురువు దివ్య ఆశీస్సులతో శాంతి ఆశ్రమ ట్రస్ట్ వినుకొండ ఆధ్వర్యంలో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో గల శాంతి ఆశ్రమంలో సకల సాంస్కృతిక కళాకారులు, గురువుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పీఠాధిపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో అంతరించిపోతున్న సనాతన ధర్మం, సాంప్రదాయ కలలు ప్రోత్సహించేందుకు వాటిని కొనసాగిస్తున్న కళాకారులు ఆధ్యాత్మిక గురువులు, ధార్మిక సేవకులను సత్కరించుకోవడం, భవిష్యత్ తరాలకు మన కలలను కీర్తిని అందించేందుకు అందరూ వారిని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ పాటలు ఆలపించారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 600 మంది కళాకారులను ఘనంగా సత్కరించారు. వెయ్యి దేవాలయాలకు ధూప దీపనైవేద్యాలకు చెందిన కిట్లను అందజేశారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పీఠాధిపతులు దయానంద దత్త స్వామి (ఏపీ సాధు పరిషత్ ఉపాధ్యక్షులు), శ్రీనివాసానంద స్వామి (ఏపీసాధు పరివార్ అధ్యక్షులు), భవాని స్వామి (శ్రీ బాలసిద్ధి పీఠం), భైరవానంద స్వామీజీ (ప్రకాశం జిల్లా అధ్యక్షులు), నందస్వామి అఘోర పీఠం, విజయశంకర స్వామి (అన్నమయ్య కళాక్షేత్ర), రుద్ర శివానంద సరస్వతి స్వామీజీ (మౌన స్వామి ఆశ్రమం), ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న గజల్ శ్రీనివాస్

క్రీడల్లో రాణించటం అభినందనీయం

చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై.హనుమంతరావు చెప్పారు. ఇటీవల నరసరావు పేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఉమ్మడి గుంటూరు జిల్లా షెటిల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పసుమర్రు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ పర్వీన్, ఎశైలు, కె.కవిత, డి.దైవకీర్తి, షేక్ రషీద్, షేక్ సల్మాన్, షేక్ హబీబుల్లా, షేక్ వసీమ్‌లు ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల జట్లకు ఎంపికయ్యారు. ఈ ఎనిమిది మంది విద్యార్థులు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలలో జిల్లా బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కె.సుదర్శనరావు, వైస్ చైర్మన్ గౌసియా, 16వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్ వలి, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు గద్దే హరిబాబు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

నాదెండ్ల: విద్యార్థులకు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. జూనియర్ ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. నూతనంగా చేరిన విద్యార్థులు గతంలో ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, కళాశాల వ్యవస్థాపకుడు చుండి రంగనాయకులు మనుమడు రంగనాయకులు, లైబ్రేరియన్ నిరంజన్‌లను సన్మానించారు.

సకాలంలో పింఛన్ అందజేయాలి

శావల్యాపురం: ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సకాలంలో లబ్ధిదారులకు పింఛను నగదు అందజేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేసే విధానం గురించి పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ వెల్ఫేర్ సహాయకులకు సమావేశం నిర్వహించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 5900 మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉన్నారని వీరందరికీ వచ్చే నెల 1వ తేదీ ఉదయాన్నే నగదు పంపిణీ జరిగేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

ప్రతిరోజూ పనులు పరిశీలిస్తా

నరసరావుపేట: పట్టణంలో కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పర్యటించారు. స్టేడియంలో పలుచోట్ల పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి, పారిశుద్ధ్యం పరిశీలించారు. పాదచారులు, ఆటలు ఆడే పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులకు సూచించారు. స్వయంగా పెరిగివున్న గడ్డి నివారణ మందులు స్ప్రే చేశారు. రానున్న రోజుల్లో స్టేడియంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com